# అద్దాల గదులు

—కిరణ్మయి

కథకుడిగా ఇప్పుడే మంచిపేరు వస్తోంది అతనికి. ఇంకా తృప్తి కలిగేలా ఎందుకో రాయలేకపోతున్నాను అని ఎప్పుడూ బాధపడుతూ వుంటాడు. రాసిన ప్రతి పలుకూ వజ్రంలా మెరవాలంటే కష్టం, అన్నాను కొంచెం ఒళ్ళుమండి ఓసారి. అతను బేలగా అయిపోయే స్థితి ఒక్క రచన విషయంలోనే కనిపిస్తూ వుంటుంది. అందుకే కొంచెం భయపడుతూనే చనువు తీసుకుంటాను. ఈ స్థితిలో అతను నా మాట వింటాడు.

నిన్న సాయంత్రం నుంచీ ముభావంగా వున్నాడు. మధ్యాహ్నం పోస్టులో అతని కథ ఒకటి తిరిగి వచ్చేసింది. కొంచెం బాహాటంగా ఆశ్చర్యపోయాను. 'ఇదేమిటి? ఇలా కథ వచ్చేసింది— నీ కథ అచ్చవ్వక పోవడమా?'

నాకు తెలిసినంత వరకూ కథలో బాగా లేకపోవడానికి ఏదీ లేదు. అదే మాట అంటే—

"కాదులే, ఆ కథ తిరిగి వచ్చెయ్యడమే మంచిదయింది—" గొణిగాడు.

"ఏం"

"ఏదో వాదన కోసం తర్కించినట్టు వుంది కానీ నిజంగా జరిగేలా లేదు" అంటూ కొంచెం అసహనంగా తలతిప్పుకున్నాడు.

** ** ** ** **

నేనూ, ఈ రచయితా ఒక రూమ్‌లో కలిసి వుంటున్నాం. ఉద్యోగాలు అదే ఊళ్ళో— వేరు వేరు కంపెనీల్లో. నాకు ఫర్వాలేదనిపించే గది అతను ఇరుకు అంటుంటాడు. అస్థిమితంగా వరండాలో స్థిరపడి పోతుంటాడు.

ఈ రచయితతో స్నేహం అయ్యేవరకూ నేను సాహిత్యం గురించి పెద్దగా తెలుసుకోలేదు. ఏ పరిమళాలూ నన్ను అంటలేదు. ఏ భావుకతా నన్ను ముల్లులాగా గుచ్చలేదు. అందుకే ధైర్యం, దర్పంగా, మర్యాదగా బ్రతకగలిగే వాడిని.

ఇప్పుడు పరిస్థితి అలా లేదు. నాకు అశాంతి పెరుగుతోంది. రచయితలు తాము ఎలాంటి ప్రపంచంలో వున్నామనుకుంటారోగానీ తమ చుట్టూ మాత్రం ఓ కల్లోల పరిస్థితిని సృష్టిస్తారు. ఆ విషయం వాళ్ళకి అర్థం కాదు.

నాకూ బాధ పెరిగింది. ముసువు తేలిగ్గా అనేసే మాటలు ఇప్పుడు నా నోట్లోంచి రానంటున్నాయి.

** ** ** ** **

## రచయిత

బయట ప్రపంచంలో కలిగే అనుభవాన్ని నాలుగు గోడల మధ్య కూర్చుని గోలగా వుండే ఒంటరితనంలో నాలుగు అక్షరాల సహాయంతో, ఒక కథని రాయడం విచిత్రమైన అనుభవం. కళ్ళు తెరిస్తే కనిపించే తెల్లటిగోడలు మనసుకి వుండవేమో. ఎక్కడ నిజం మొదలవుతుందో, ఎక్కడ ఆగిపోతోందో చెప్పడం కష్టమవుతుంది.

యధాతథంగా జీవిత ఘట్టాన్ని రాస్తే ఏ విధమైన హృదయ స్పందనా కలగదు. ఆ లోతుపాతులు మనసుకి అర్థం అయ్యే భాష ఒకటైతే, దానిని పది మందితో చెప్పకోవాలనే ఆరాటం, చెప్పకునే భాష వేరౌతున్నాయి.

తను ఎందుకింత తల్లడిల్లిపోతున్నాడు? ఎందుకింత బేలగా అయిపోతు న్నాడు? ఎవరి ప్రాపుకోసం ఇంతగా పాకులాడుతున్నాడు?

** ** ** ** **

"అసలు కథ రాసే విధానాన్నే నేను మార్చుకోవాలి. నిశ్శబ్దంగా వున్న గదిలో కూర్చుని కల్లోలంగా వుండే మనసుని స్వాధీనపరచుకునే పద్ధతా కథ రాయడం అంటే!" రచయిత అనుమానం.

"నీకో విషయం తెలుసా?" నావైపు చూస్తూ అడిగాడు. లేదన్నట్టు తల ఊపాను.

"నాలో చాలా మంది మనుషులున్నారని నేను ఎప్పుడూ అనుకునేవాణ్ని! ఆడవాళ్ళు, మగవాళ్ళు, ముసలి వాళ్ళు, పసిపాపలు, అవకరంగా వున్నవాళ్ళు, అందమైన వాళ్ళు—ఇలా నాలో అందర్నీ గమనిస్తూ బయట అనుభవాన్ని వాళ్ళ కళ్ళల్లోంచి చూసేలా చేసుకుంటూ కథ రాసేవాణ్ని."

సిగరెట్ డబ్బాకోసం వెతికి అటూ ఇటూ అయిం తర్వాత—

"బహుశా నిజంగా మనుషులను చూడడం మానుకున్నాను. నాకు తెలీకుండానే ప్రపంచానికి దూరం అయ్యాను."

** ** ** ** **

## రచయిత

జీవమున్న ఏ పదార్థమైనా ఎదుగుదల మార్గంలో ప్రయాణిస్తుంది. దీనికి ముందుకు నడిచే శక్తి వుంటుంది. ఒకోసారి నడవలేక ఆగిపోతుంది. ఒకోసారి పృత్యువాత పడుతుంది.

అందరి మనసుల్లోనూ జీవం వుంటుంది. అనేక రూపాల్లో! అగరుబత్తిలో దాక్కునే అందమైన పొగలా దానికో ఖచ్చితమైన సువాసన కూడా వుంటుంది. దానిని వెలిగించే అగ్గిపుల్ల అనుభవం కావాలి.

విచిత్రంగా, ప్రపంచం మొత్తంలోనూ కాలి బూడిద అవుతున్నవారు చాలా మందే వున్నారు. వారు చవిచూసే మృత్యువు వారికి చాలా కాలమైతే కానీ [illegible]. ఇది మంచా, చెడ్డా అన్నది కాదు కానీ ఈ 'జీవ పదార్థం' పొందే మార్పులు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి.

ఎదుటి వ్యక్తిలోని జీవశక్తిని చూడడం, అతని సువాసనను పీల్చి ఆ వింత అనుభూతిని ఆకళింపు చేసుకోవడం రచనకి కావల్సిన ముఖ్యమైన విషయం.

** ** ** ** **



"ఇప్పటింతకీ ఈ తిరిగొచ్చేసిన కథలో లోపం ఏమిటంటారు?" అడిగాను.

"నువ్వు కథ పూర్తిగా చదివావా?"

"ఆ చదివాను!"

అతను విపులంగా చెబ్దామన్న ఉద్దేశంలో లేడు. ఏదో పనున్న వాడిలా రూమ్‌లో అటూ ఇటూ తిరుగుతూ బయటకు వెళ్ళడానికి తయారయ్యాడు.

"ఈరోజు సాయంకాలం మాట్లాడుకుందాం" అన్నాడు బయటికి వెళ్ళిపో యాడు.

అతని కథ చేతిలోకి తీసుకున్నాను.

ఒక విలువైన క్షణాన్ని పొందుతానని ఆశపడి, భంగపడి తనని తాను చంపేసుకున్న ఓ అమ్మాయి

గురించి– ఆ కథ!

** ** ** ** **

## రచయిత

తనలో కదిలే ప్రతి జీవనాడి బయటకు ఎగిరే వల తనకు స్పష్టంగా తెలుస్తోంది. తనలో ఎదుగుతున్న 'జీవం' పసిపిల్లాడిలా వుందా, వృద్ధుడిలా వుందా, అందంగా వుందా, అనాకారిగా వుందా అన్నది తెలుస్తుంది.

అది పసి పిల్లాడిలా వున్నప్పుడు –చూసిన ప్రతీదీ తనదనిపించేది!

అది మహా వృద్ధుడిలా వున్నప్పుడు– పాత కొత్త అనుభవాలనేవి లేవనేంత కాలాతీత వ్యక్తిలా అనిపించేది.

ఒకోసారి ఈ జీవం చచ్చిపోతూ వుంటుంది. ప్రక్కనే వేరే విత్తనం మొలకకి సిద్ధంగా వుంటుంది.

ఈ గమనం అత్యద్భుతమైంది!

** ** ** ** **

సాయంకాలం–

ఎండకీ, నీడకీ మధ్య చెట్లు పలుచటి చీకటి తెరలు కడుతున్నాయి.

మనసుకీ, మాటకీ ముడిపెడుతున్న వాడిలా అతను మాట్లాడడం ప్రారంభించాడు.

కథ గురించి–

"నీకేమీ బాగా లేదనిపించలేదా?"

ఒక్క నిమిషం ఆలోచించి,

"ఆ అమ్మాయి చనిపోకుండా ఉండాల్సింది" అన్నాను.

"అదే నేను చెబుతున్నదీ కూడా! ఎందుకు చంపేశాననుకున్నావు?

నాకు అర్థం కాలేదు. రచయిత, ఎవర్నైనా కావాలని చంపేద్దామనుకుంటాడా? అదేమాట అన్నాను.

"ఎందుకనుకోడు? ఒకోసారి చావు తేలికగా కనిపించే ఉపాయం."

"ఎందుకు చంపేశావు?"

"ఒకమాటలో చెప్పలేను కానీ... ప్రతి రోజు మనసులో చాలా సార్లే చచ్చిపోతూ వుంటాం. ఈ చావుముందు కలిగే దుఃఖం అన్నిసార్లూ విచిత్రంగా వుంటుంది. అలాంటి ఓ పరిస్థితి గురించి రాస్తుంటే చావు సబబనిపించింది. దాన్ని సమర్థించుకోవడానికి ఎలా బ్రతకశక్యం కాదో రాశాను."

"మరి... ఇప్పుడు...?"

"కథ రాసేసిన కొన్నాళ్ళకి గుబులుగా అనిపించటం మొదలైంది. నాలోని ముఖ్యమైన భాగం చచ్చిపోయినట్టనిపించింది. ఇది అన్యాయం అని కూడా అనిపించింది. నేను బయటకి చావలేని చావును ఓ కథలో సృష్టించుకుని తృప్తి పడ్డాను. పైగా అదే నిజమని వాదించబోయాను. ఓ చిన్న అమ్మాయిని అలా చంపెయ్యాలనుకోవడం ఘోరం కదూ!"

** ** ** ** **


భౌతికమైన మరణానికీ, మనసుకి సంబంధించిన మరణానికీ మధ్య సంబంధాన్ని వివరిస్తూ అతను రాసిన కథకి మంచి పేరు వచ్చింది. అతను ఇపేం పట్టనట్టు వున్నాడు ప్రస్తుతం. దూరంగా మరో ఊరికి బదిలీ మీద వెళ్ళిపోతున్నాడు. ఇన్నాళ్ళ స్నేహం, మాటలు– నన్ను ఎంతో మార్చాయి. అతను వెళ్ళకుండా వుంటే చాలు అని స్వార్థంగా కోరుకున్నాను.

కానీ ఎలా సాధ్యం!

"నీ విలాసం ఇచ్చిపోవోయ్!" అన్నాను వెటకారంగా. నా మనసంతా పుండులా వుంది.

అతను విచిత్రంగా చిరునవ్వు నవ్వాడు.

"ఊరు వెళ్ళగానే రాస్తాను లెండి" అన్నాడు.




### "టీ ప్రియులకు ఒక్క మాట"

టీ తయారు చేయడంలో ఎవరికి వారు తమకు తోచిన విధానాన్ని అవలంబిస్తారు. అయితే శాస్త్రీయంగా ఏ విధానం సరైనది అనేది అందరికీ తెలియని విషయం. కొందరు మొదట పాలు పోసి చేస్తే, మరికొందరు డికాషన్ వడబోసి పాలు కలిపి తాగుతారు. అయితే ఈ రెండింటి మధ్యన శాస్త్రీయమైన తేడా వుంది. ఈ రెండు సందర్భాలలో జరిగే రసాయనిక ప్రక్రియల్లో తేడా వుంది. అంటే టీ తయారీలో ముఖ్యంగా జరిగే రెండు రసాయనిక చర్యలు డినాచురేషన్, ట్యానింగ్.

డికాషన్‌లో పాలు కలపడం వలన పాల మొదటి చుక్క డినాచురేటింగ్‌కు గురౌతుంది. ఇది టీలో 'కాచిన పాల' రుచినిస్తుంది. ఈ విధానంలో కేసిన్ (పాలలోని ప్రొటీన్ భాగం)లోని మొదటి మాలిక్యూల్స్, ఆ తర్వాతి చుక్కల కన్నా ఎక్కువ సంపూర్ణంగా ట్యానింగ్‌కు గురౌతాయి. ఇది మరింత విశేషమైన రుచినివ్వడానికి తోడ్పడుతుంది. అయితే ఈ కాచిన పాల రుచిని వద్దనుకుంటే ముందరే డికాషన్‌తో పాటుగా పాలను కలపడం మంచిది. అంతేకాక నీళ్ళపాలను డికాషన్‌తో సహా కాచి టీ చేసుకోవడం వలన బాక్టీరియా వంటివి నశించే అవకాశం వుంది.

–పి.వి.ఎస్.రవీంద్రవర్మ


అతను ఇప్పుడు బేలగాను లేడు, ప్రతి విషయం గురించి పెద్ద బాధపడట్లేదు. ఏదో మార్పు వచ్చింది.

** ** ** ** **

## రచయిత

మనసు చచ్చిపోయిందో, మనిషే చచ్చిపోయాడో చెప్పలేని పరిస్థితి ఒకోసారి వుంటుంది.

ఈ రెండింటికీ మధ్య వున్న తేడా ఈ మధ్యే అర్థం అవుతోంది. పెద్ద చదువు లేం అఖ్ఖర్లేదు ఇలాంటివి అర్థం చేసుకోవడానికి.

ఎదురుగా సంఘటన రూపంలోనో, వ్యక్తి రూపంలోనో ఓ అనుభవం ఎదురైతే అందరూ వేదాంతులై పోతారు. మాయ అంటారు, పాశం అంటారు, కోరికలంటారు, మిధ్య అంటారు. వీళ్ళని చూస్తే అద్దాల గదిలో ఇరుక్కుపోయిన మనుషులు గుర్తొస్తారు. ఎన్నో ప్రతిబింబాలు చూస్తూ తనెక్కడ నిజంగా వున్నాడో మర్చిపోయే బహుదూరపు బాటసారి లాంటి వారు. చావుకి చూసి భయపడతారు, అద్దాన్ని చూసి మురిసిపోతారు. అద్దం పగిలితే భయపడతారు, అసహ్యించుకుంటారు– ఆశ్చర్యం కదూ!

జీవితం ఒక మరణంతో అయిపోతుందా? ఎంత మందికి ప్రాణాలు పోయాలి! పోసిన ప్రాణం పట్ల మమకారం చంపుకోకుండా, ఎంత స్వార్థంగా స్పందించాలి! ఇవన్నీ చిన్న చిన్న విషయాల్లా కనిపిస్తాయి.

రచన చేసేముందు నేనిప్పుడు అందర్నీ నిశితంగా చూస్తున్నాను. నాతో సహా, అందర్నీ–

వాళ్ళు కంగారుగా కట్టుకునే అద్దాల గదుల్లోకి దారులు వున్నాయా అని గమనిస్తున్నాను. కలం తీసుకుని చిన్న చిన్న అక్షరాలతో జీవన విలాసాలు రాస్తున్నాను.

❄